
‘‘అసలు కథేంటి? అది చెప్పు ముందు?!’’ ఆతృతగా అడిగా వాడ్ని..

‘‘సూపర్ కథరా?!... లేటెస్ట్ ట్రెండ్! హీరోయిన్ అమలాపురం అమ్మాయి. చాలా ఒద్దికగా, బుద్ధిగా పెరిగిన కుర్రది. హీరో ఓ పెళ్ళికోసం ఆ వూరొస్తాడు.



# ‘టూ...మచ్!’

– [illegible]

**‘‘ఒరేయ్! ఇవాళైనా మా పిక్చర్ షూటింగ్ చూడ్డానికి వస్తావా? రావా? మిత్రద్రోహీ...! పిల్చీ పిల్చీ నా నోరు నెప్పెడుతోంది కానీ నువ్వు మాత్రం రావట్లేదు!! రేయ్! వెధవా!! వచ్చే వారం ‘పాటల’ పిక్చరైజేషన్ కోసం స్విట్జర్లాండ్ పోతున్నామురా...!’’ ఫోన్‌లో వాయించేస్తున్నాడు బాలరాజు!**

‘‘**సా**రీ! వీలు కుదరక రాలేకపోయాను! ఈరోజు ష్యూర్‌గా వస్తాను! ఆ ( ... అన్నట్టు లొకేషన్ ఎక్కడో చెప్పు?’’ అంటూ వాడు చెప్పిన స్టూడియో పేరు నోట్ చేసుకున్నాను మనసులోనే!!

నేను వెళ్ళేసరికి షూటింగ్ మొదలైపోయింది. బాలరాజు నూనూ చెడ్డీలు వేసుకుంటున్నప్పట్నుంచీ స్నేహితులం! వాడు సినిమా ప్రొడ్యూసర్‌గా సెటిలైతే – నేను బ్యాంక్ జాబ్‌లో స్థిరపడ్డాను. ఇదిగో వాడి గోల భరించలేక వచ్చాను కానీ... నాకు సినిమాలపై పెద్ద ఇంట్రస్ట్ ఏడ్చి చావలేదు!!

స్టూడియో అంతా నానాకంగాళీగా వుంది. ఒకడు లైట్స్ అమర్చుతుంటే మరొకడు లైన్‌గా ఆర్పేస్తున్నాడు.. అదేంటో మరి...! మేకప్పులో అందరూ ‘గొప్పగానే’ కన్పిస్తున్నారు! ఓ చోట ట్రాలీ అట (నాకు తెలీదు బాబూ) అదేదో గిర్రున తిరిగేస్తోంది!! హీరో జీన్స్, షర్ట్‌లో ‘యమాగానే’ వున్నాడు!! హీరోయిన్ మాత్రమే... ఏంటోగా వుంది!! అవును మరి!! బట్టలు మరీ తక్కువగా వున్నాయ్!!

‘‘ఏవిట్రా? క్లబ్ డ్యాన్సా?!’’ అడిగాను.

‘ఓసి! నీ అమాయకత్వం కూలా?!’’ అది సాంగ్ సీక్వెన్స్‌కు వేసిన డ్రస్‌రా...?’’ గట్టిగా నవ్వాడు బాలరాజు.

హీరోయిన్‌ని చూస్తాడు. మనసు పారేసుకుంటాడు!! అంతే ఇద్దరి పెళ్ళి అయిపోతుంది. తీరా ఫస్ట్‌నైట్ నాడు ఆ అమ్మాయి బాంబ్ పేలుస్తుంది...!’’

‘‘ఏవిటీ? దీపావళి బాంబా?’’ అన్నాను.

చిరాగ్గా చూస్తూ ‘‘వెధవ జోకులెయ్యకు! హీరోయిన్ మనసు అంతకు ముందరే తన బావకు ఇచ్చేస్తుంది. ఆ బావ ఓ యాక్సిడెంట్లో ఎక్కడో తప్పిపోయాడు. సో...! ఆ పిల్ల మనసంతా బావమీదే వుందన్న మాట! హీరోగారు అది విని బోలెడు జాలిపడిపోయి తన పెళ్ళాన్ని బావతో కలిపేస్తాడన్న మాట!!’’

‘‘ఆ తరువాత హీరో సన్యాసుల్లో కలిసిపోతాడా’’ అన్న నా మాటకు ‘‘ఛట్! నోరుముయ్‌రా బాడ్‌కోవ్!’’ విసుక్కున్నాడు.

‘‘అది సరే! అమలాపురం అమ్మాయన్నావ్?! ఎంచక్కా లంగా ఓణీ వెయ్యకా ఆ బట్టలేంటి? దరిద్రంగా...?’’

‘‘అదిగో ...! అందుకే నిన్ను సినిమాలు చూసి బాగుపడమని చెబ్తాను. ఇది డ్రీమ్‌సాంగ్ అన్నమాట.

హీరో అలా ఊహించుకుంటాడు...!''

'నాకు ఒక్కటీ అర్థం అయి చావలేదురా? పెళ్ళికి ముందర బావతో చెట్టాపట్టా లేసుకుని తిరిగిన అమ్మాయి మరి హీరోగారితో పెళ్ళికెలా ఒప్పుకుందీ..'

''అంటే! ఆ పిల్లకు తల్లిదండ్రులంటే భయమూ.. భక్తీ అన్న మాట...?''

''అదేంటీ? ప్రేమించుకుని... చెట్లమ్మటా.. పుట్టమ్మటా తిరగటానికి లేని భయం... అమ్మా నాన్నకు చెప్పటానికి వచ్చిందా...?'' పాపం... అనవసరంగా హీరో జీవితాన్ని పాడు చెయ్యటానికి కాకపోతేనూ...? బోలెడు జాలిపడిపోతే (నేను సుమండీ...)

''అబ్బబ్బా! నీ చచ్చు క్వశ్చన్లతో చచ్చిపోతున్నానురా బాబూ... పదేళ్ళకో సినిమా చూసే నీకు ఇదంతా అర్థం కాదులేరా? మాట్లాడకుండా షూటింగ్ ఎంజాయ్ చెయ్...'' అరిచాడు. ఇహ మరీవాడ్ని బాధపెట్టటం ఇష్టంలేక షూటింగ్ వైపు దృష్టి సారించాను.

మా వూళ్ళో డ్రిల్లు మాష్టారు నేర్పించిన ఎక్సర్‌సైజుల్ని కొంచెం 'మాడిఫై' చేసి హీరోహీరోయిన్ చేత డ్యాన్స్ లాంటిది చేయించేస్తున్నాడు. నానా రకాల ఫీట్లతో ఆ అమ్మాయి ఒళ్ళు హూనం అయిపోయి వుంటుంది. పాపం ఆడకూతురు!! అసలే అత్తెసరు గుడ్డలతో వుంటే హీరో ఎక్కడెక్కడో చేతులేసేస్తున్నాడు నాకు ''ఏవిటోగా'' వుంది!

''అవునూ.... హీరోహీరోయిన్లు ఒకళ్ళనొకళ్ళు ముట్టుకోకుండా పాట పాడుకోలేరా...?'' డౌటొచ్చింది నాకు అదే ప్రశ్నించాను.

''అప్పుడది డ్యూయెట్ కాదు! మన 'జాతీయ గీతం జనగణమణ' అవుతుంది'' గుడ్లెర్ర చేశాడు వాడు.

''లైట్స్ ఆఫ్'' అరిచాడు డైరెక్టరు!!

ఆ కేకకు జడుసుకున్నాను. ఓసారి కళ్ళు మూసి తెరిచానో లేదో అందరూ 'పొలోమని' ఎక్కడికో ఉరుకుతున్నారు.

''ఏవిట్టీ?''

''లంచ్ బ్రేక్‌రా!? ఏం తీసుకుంటావ్? రైసా? టిఫినా?!'' అని వాడు అడుగుతుంటే –

ఇంతలో ఓ కుర్రాడు పరిగెత్తుకుని పి.టి.ఉష లెవల్లో మా దగ్గరకొచ్చేసి –

''సార్! సార్! హీరోగారికి చైనీస్ ఫుడ్ కావాలిట!! మరేమో... హీరోయిన్ గారికి యాపిల్ జ్యూస్ అట!'' గొప్ప వినయంతో విన్నవించాడు.

''సర్లే! పట్రాపోయి!'' ఓ అయిదు వందల నోట్ వాడికిచ్చాడు మా బాలరాజు.

నేను ఆశ్చర్యంగా సదరు చైనాఫుడ్ గార్ని, యాపిల్ జ్యూస్ గార్ని చూశాను. వీళ్ళు రోజూ ఇంట్లో ఇవే తింటారా? అప్పనంగా వస్తున్నాయని మెక్కుతున్నారా? అసలు 'పప్పుచారు' ముఖం కూడా చూసినట్టు లేదు. బోడి బడాయి కాకపోతేనూ... మా వాడి డబ్బు మంచినీళ్ళలా ఖర్చయిపోతోందని నా బాధ, వ్యధానూ..!

పీకల దాకా మెక్కి బ్రేవ్‌మని తేన్చాకా మళ్ళీ షూటింగ్ మొదలు...

హీరోగారు సదరు పెళ్ళాం బావగారి కోసం వెతుకులాట. ఈలోగా పక్కింట్లో వుండే కమేడియన్ హీరోగారి పాట్లు, అగచాట్లు తెలీక హీరోహీరోయిన్‌ని ఊహించేసుకుంటూ ఓ పాటలో కెళతాడట!!

''ఆ పాటని స్విట్జర్లాండ్ మంచు కొండల్లో తీస్తాం!'' గర్వంగా చెప్పాడు మా వాడు.

''అది కాదురా?! ఎవడో పక్కింటి కోన్‌కిస్కాగాడు వాడి భార్య గురించి 'సాంగ్' పాడుకోకుండా హీరోహీరోయిన్ గురించి... వాళ్ళు కిందపడటం, మీద పడటం గురించి కల కనటవేంటి?! మరీ అబ్సర్డ్ కాకపోతేనూ...' నా డౌట్ ఎక్స్‌ప్రెస్ చేసేసరికి –

''అర్రే! ఛుప్ బైట్! అది అంతే! దటీజ్ సినిమా!'' కరిచాడు కాదు – కాదు అరిచాడు బాలరాజు.

ఏవిటో? అంతా అయోమయంగా వుంది నా పరిస్థితి. అసలు కథే పెద్ద అయోమయం!! హీరోహీరోయిన్ అనుమతి లేకుండానే ప్రేమించేస్తాట్ట!! ఈలోగా హీరోయిన్ బావకు అన్నీ (కాదు – కాదు మనసు మాత్రమే) ఇచ్చేస్తుందట. కానీ బయట చెప్పదట (అంటే ఎవరు గుడ్డివాళ్ళు... తల్లిదండ్రులా లేక మనమా...?) పెళ్ళయి పోయాక హీరోకి (మొగుడికి) చెప్పి భోరుమంటుందట!! పాతికేళ్ళు పెంచిన తల్లిదండ్రులకు చెప్పని రహస్యాన్ని ఒక్క రాత్రిలో భర్తకు చెబుతుందన్న మాట! ప్ఫ్! ఏవిటోనండీ...! అందుకు హీరోగారు కరిగి నీరైపోయి అగ్నిసాక్షిగా వేదమంత్రాల మధ్య తాళికట్టిన భార్యని 'మనసు'




ప్రధానంగా తీసుకుని వాళ్ళ బావ గారికి అప్పచెప్పేస్తాడట!! బాప్‌రే...! ఇదో కొత్త కథట!! ప్రస్తుతం జనం లైక్ చేస్తోన్న సబ్జెక్ట్ అట!! దానికోసం మధ్యలో పాటలు! ఫారిన్ షూటింగ్ అట!! అంటే మన 'ఇండియా'లో మంచుకొండలు, మట్టిదిబ్బలు కరువై పోయినట్టు... అందరూ విదేశీ పాటల మోజూ... తేరగా డబ్బు ఖర్చవుతుంటే చేదా? అని మనసులోనే అనుకుంటూ (పైకి చెబితే మా వాడే నన్ను 'కైమా' దంచేస్తాడేమోనని భయం) ...

''సర్లేరా! ఇక వెళ్ళొస్తాను! పిక్చర్ రిలీజ్ అప్పుడు పిలువు!! వచ్చి మొత్తం చూస్తాన్లే'' అంటూ వాడికి భరోసా ఇచ్చి భయటపడి తేలిగ్గా ఊపి రి పీల్చుకున్నాను నేను.

❁❁❁

అనుకున్నట్టుగానే అంతా 'ప్లానింగ్' ప్రకారం మా వాడి సినిమా పూర్తయింది. గొప్ప పబ్లిసిటీ ఇచ్చేశాడు. పిక్చర్ రిలీజ్ అప్పుడు నన్ను గుర్తు పెట్టుకుని 'ఇన్‌వైట్' చేశాడు కూడా...! బ్యాంక్‌లో పని ఒత్తిడి వల్ల నేనే వెళ్ళలేకపోయాను.

బాలరాజు సినిమా సూపర్ హిట్టయింది. మా బ్యాంక్‌లో వాళ్ళంతా అనుకుంటే సంతోషించాను నేను. ఓ శుభోదయాన వాడిని 'గ్రేట్' చేసి కంగ్రాట్స్ చెపుదామని బయలుదేరాను.

నేను వెళ్ళేసరికి –

''డాడీ...! నా పెన్సిల్ కన్పించటం లేదు! ఎక్కడ పెట్టావ్? నోట్స్ వ్రాసుకోవాలి?'' మా వాడి పెద్ద కొడుకు అరుస్తున్నాడు.

''నాన్నా...! నాన్నా! ఈ చెడ్డీ వేయవా? స్కూలు టయిమయిపోతోంది టీచర్ కొడ్తుందేమో...'' చిన్నది చెడ్డీతో మా వాడ్ని కుదిపేస్తోంటే...

''సార్! సార్! టిఫిన్ రెడీ అయింది!? కూరలేం చేయమంటారూ?'' కొత్త వంటవాడు ప్రశ్నలతో మరో పక్క బాలరాజుని తినేస్తున్నాడు?

అక్కడి వాతావరణం.. ఆ పరిస్థితి ... ఆ పిల్లలు.. హడావుడి ... మా వాడి దిగులు మొఖం... నాకంతా అగమ్యగోచరంగా... ఆశ్చర్యంగా ఉంది...

''అదేవిట్రా? మీ ఆవిడేదీ? ఈ పన్లన్నీ నువ్వు చేస్తున్నావ్?'' అడిగానో లేదో –

అంతే –

''ఒరేయ్! రాముడూ అన్యాయం జరిగిపోయిందిరా? నేను తీసిన సినిమా కథ మా ఆవిడకి బాగా నచ్చేసిందిట. నా ఆదర్శాలు అద్భుతమట!! నేను దేవుడ్నిట!! అందుకే ఎప్పుడో కాలేజీలో ప్రేమించిన కాలేజ్‌మేట్ మొన్నే ఫారిన్ నుండి వచ్చాట్ట!! సో... పెళ్ళి, భర్త, పిల్లలు కంటే 'ప్రేమించిన వాడే' ముఖ్యమని అర్థం అయిందిట!! ఎంచక్కా వాడితో అమెరికా ఫ్లయిట్ ఎక్కేసిందిరా...!'' నన్ను కావలించుకుని వలవలా ఏడ్చేస్తూ గొల్లుమన్నాడు!!

పాపం బాలరాజు!!